www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 11 ఏప్రిల్ 2023

భీమవరం కలెక్టరేట్లో క్యాంటీన్ ప్రారంభం

భీమవరం : డ్వాక్రా మహిళల సారథ్యంలో కలెక్టరేట్ కాంపౌండ్లో ఏర్పాటుచేసిన క్యాంటీన్ను కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ప్రారంభించారు. డిఆర్డిఎ ఆధ్వర్యంలో తాడేరు గ్రామం ఏసు స్వయం సహాయక సంఘం డ్వాక్రా మహిళలచే కలెక్టర్ కార్యాలయం కాంపౌండ్లో ఈ క్యాంటీన్ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యం దృష్ట్యా ఆర్గానిక్ ఉత్పత్తులు, చిరుధాన్యాలతో వంట తినుబండారాలు తయారు చేసి ఇవ్వాలన్నారు. వ్యాపారానికి పెట్టుబడి నమ్మకం అని, రుచికరమైన పదార్ధాలు తయారు చేసి తక్కువ ధరలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పీడీ వేణుగోపాల్, సమాచార శాఖ ఎడి దాసరి నాగార్జున, డ్వాక్రా పీడీ రాజేశ్వరరావు, అగ్రికల్చర్ అధికారి ఎ.దుర్గేష్, సిపిఒ బి.శ్రీనివాసరావు, ఎల్డిఎం వెంకటరమణ, డ్రైనేజీ, నీటిపారుదల శాఖ అధికారి పి.నాగార్జునరావు, హ్యాండ్లూమ్ ఎడి అప్పారావు, డిపిఎం కె.శ్రీనివాస్, కుసుమ, వెంకటేశ్వరరావు, తాడేరు ఏసు స్వయం సహాయక సంఘాలు నాయకురాలు జి.లక్ష్మీతులసి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

కెవిపిఎస్ ఆధ్వర్యాన డిఆర్ఒకు వినతి

ప్రజాశక్తి - పాలకోడేరు

జిల్లావ్యాప్తంగా ఉన్న దళితపేటల్లో జలజీవన్ మిషన్ (జెజెఎం) పనులను తక్షణం పూర్తి చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ దళితపేటల్లోని తాగునీటి సమస్యలు పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ జిల్లాలోని 20 మండలాల దళితపేటల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. ఇంటింటి కుళాయి పేరుతో పంచాయతీ పరిధిలో అధికారులు సొమ్ము వసూలు చేసి నేటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వలేదని తెలిపారు. గతంలో ఉండి మండలం చిలుకూరులో తాగునీటి సమస్యపై దళితులతో కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా చేశామని గుర్తు చేశారు. జిల్లావ్యాప్తంగా ఈ సమస్య తీవ్రతరమవుతుందన్నారు.

20 మండలాల్లోని ప్రతి గ్రామ, దళితపేటల్లో ఈ సమస్య మరింత పెరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తున్నామని ప్రచార ఆర్భాటాలు చేసుకుంటున్నారని విమర్శించారు. కానీ జిల్లాలో ఎక్కడా జలజీవన్ మిషన్ పథకం పనులు పూర్తికాలేదన్నారు. ఈ వేసవిలో తాగునీటి సమస్య మరింత తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం జిల్లా అధికారులు స్పందించి దళితపేటలో సమస్యను పరిష్కరించాలని, జలజీవన్ మిషన్ పథకం ద్వారా అన్ని దళితపేటల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందించినవారిలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్ ఉన్నారు.

నల్ల మాస్కులు ధరించి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ఎపి అమరావతి జెఎసి ఆధ్వర్యాన భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు రెండో దశ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా కలెక్టరేట్లోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా నలుపు మాస్కులు ధరించి సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకూ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజూ వివిధ రూపాల్లో కొనసాగించే విధంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించామన్నారు. ఉద్యోగులంతా ఐక్యంగా సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం కొనసాగిస్తారని చెప్పారు. ప్రధానంగా సిపిఎస్ను రద్దుచేసి ఓపిఎస్ను పునరుద్ధరించాలని, డిఎ బకాయిలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జిల్లా కేంద్రాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు హెచ్ఆర్ఎ 16 శాతం ఇవ్వాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమోహన్, అమరావతి జెసి జిల్లా చైర్మన్ ఎస్.శివశంకర్, సెక్రటరీ పణి, ఎపిఆర్ఎస్ఎ జిల్లా సెక్రటరీ రామ్ప్రసాద్, ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎ.సత్యనారాయణ , కలెక్టరేట్ పరిపాలనాధికారి వై.దుర్గా కిషోర్, సీనియర్ సహాయకులు వి.వి.పెద్దిరాజు, పి.వి.సాంబశివరావు, డిటి రఘు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్కు వినతిని అందిస్తున్న ఉద్యోగులు

స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో అందిన ప్రతిదరఖాస్తునూ నిర్ణీత సమయంలోగా పరిష్కరించడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్లో స్పందన నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి 178 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులకు సంతృప్తి కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా సమస్య పరిష్కారంలో అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజూ స్పందనపై పది నిమిషాల సమయం కేటాయిస్తే ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిపిఒ ఎం.నాగలత, డిఎల్డిఒ కెసిహెచ్.అప్పారావు, భీమవరం డిఎస్పి బి.శ్రీనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

చెట్ల కింద చదువులు..!

మాజీ మంత్రి ఆళ్ల నాని ఇలాకాలో దుర్భర పరిస్థితి

జిల్లా కేంద్రం ఏలూరులో డిగ్రీ విద్యార్థుల పరిస్థితి దారుణం

15 ఏళ్లుగా డిగ్రీ కాలేజీకి స్థలం, భవనాల్లేని దుస్థితి

కుర్చీలు, మరుగుదొడ్లు వంటి వసతుల్లేక 300 మంది విద్యార్థులు అవస్థలు

ఏలూరు కలెక్టరేట్ వద్ద రోడ్డుపై తరగతులు నిర్వహించి నిరసన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మాజీమంత్రి, ఏలూరు ఎంఎల్ఎ ఆళ్లనాని ఇలాకాలో డిగ్రీ విద్యార్థుల పరిస్థితి దుర్భరంగా మారింది. డిగ్రీ కాలేజీ మంజూరై 15 ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికీ స్థలంగానీ, భవనం గానీ ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు కోటదిబ్బపైన ఉన్న ఇంటర్ కాలేజీ రేకుల షెడ్లలోనూ, చెట్ల కింద వారికి తరగతులు నిర్వహించాల్సిన దయనీయ పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వ కాలేజీల్లో చదివే విద్యార్థులంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. పేద విద్యార్థులు చదువుకునే కాలేజీల గురించి ప్రభుత్వాలకు ఏమాత్రమూ పట్టడం లేదు. 2006కు ముందు ఏలూరులో డిగ్రీ కాలేజీ ఏర్పాటు కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున పోరాటం చేశాయి. ఎట్టకేలకు 2008లో ప్రభుత్వం అధికారికంగా డిగ్రీ కాలేజీకి గుర్తింపు ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిగ్రీ కాలేజీ ఏర్పాటు అప్పట్లో తాత్కాలికంగా కోటదిబ్బపైన ఉన్న ఇంటర్ కాలేజీ రేకుల షెడ్లలో ప్రారంభించారు. 15 ఏళ్లగడిచినా ఇప్పటికీ డిగ్రీ కాలేజీకి సొంతభవనం ఏర్పాటు కాలేదు. దీంతో ఇంటర్ కాలేజీకి సంబంధించి ఏవైనా కార్యక్రమాలు జరిగితే డిగ్రీ విద్యార్థులు చెట్లకింద చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఇక్కడ ఇంటర్ పరీక్ష పేపర్ల వాల్యూయేషన్ జరుగుతోంది. దీంతో విద్యార్థులకు తరగతి గదులు లేకుండా పోయాయి. చెట్లకిందే చదువుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం ఏలూరు డిగ్రీకాలేజీలో మొదటి ఏడాది విద్యార్థులు 57 మంది, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 137 మంది, తృతీయ సంవత్సరం విద్యార్థులు 98 మంది దాదాపు 300 మంది విద్యార్థులున్నారు. మొత్తం 15 సెక్షన్లుగా విభజించారు. ఇక్కడ బిఎస్సి, బిజెడ్స్, బిఎ కోర్సులు నడుస్తున్నాయి. అంధ విద్యార్థులు ఇక్కడ పెద్దఎత్తున చదువుతున్నారు. ఇంతమంది విద్యార్థులు ఉన్నప్పటికీ డిగ్రీకాలేజీకి స్థలంగానీ, భవనంగానీ లేకుండా పోయింది. డిగ్రీ కాలేజీ ఏర్పాటయ్యాక ఇప్పటి వరకూ దాదాపు 15 బ్యాచ్లు ఎన్నో ఇబ్బందులు పడుతూ విద్యాభ్యాసం పూర్తిచేశాయి. ఏలూరు నియోజకవర్గానికి ఎంఎల్ఎగా ఆళ్లనాని ఉండగా డిగ్రీ కాలేజీ మంజూరైంది. ఆ తర్వాత ఇప్పటి వరకూ ఆయన పదేళ్లకు పైగా ఎంఎల్ఎగా, మంత్రిగా కూడా పనిచేశారు. 2014 నుంచి 2019 వరకూ టిడిపి ఎంఎల్ఎ ఉన్నారు. ఎవ్వరూ కూడా డిగ్రీ కాలేజీకి సొంతభవనాల ఏర్పాటు గురించి పట్టించుకోలేదు. ఒక్కసారి తంగెళ్లమూడి, మరోసారి సత్రంపాడులో ఏర్పాటు చేస్తామని చర్చసాగిన విద్యార్థులకు దూరభారమయ్యే పరిస్థితి ఉండటంతో ముందుకుసాగలేదు. ఎంఎల్ఎ ఆళ్ల నానికి డిగ్రీ విద్యార్థులు గోడు పట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కళాశాల ఆవరణలోని చెట్లకింద చదువుతున్న విద్యార్థులు

కనీస సదుపాయాలు లేని దుస్థితి

డిగ్రీ విద్యార్థులకు ఒకేఒక్క ల్యాబ్ ఉన్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. సరైన కుర్చీలుగానీ, టేబుళ్లుగానీ విద్యార్థులకు లేవు. మరుగుదొడ్లు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో విద్యార్థుల సంఖ్యలేదు కాబట్టి భవనాలు నిర్మించడం లేదంటూ చెబుతున్న తీరు అత్యంత దారుణమని చెప్పొచ్చు. డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు నిర్మించాలని, అప్పటి వరకూ తాత్కలిక వసతి ఏర్పాటు చేయాలని విద్యార్థులు రోడెక్కి ఆందోళనలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆళ్ల నానిని కలిసేందుకు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రయత్నాలు చేసినా అవకాశం ఇవ్వలేదని విద్యార్థులు చెబుతున్నారు.

కనీసం మరుగుదొడ్లు లేవు

పి.దుర్గాప్రసాద్, డిగ్రీ ద్వితీయ సంవత్సరం

ఏలూరులో డిగ్రీ కాలేజీకి సొంతభవనం లేకపోవడంతో చెట్ల కింద, రేకుల షెడ్లలోనే చదువుకోవాల్సి వస్తోంది. ల్యాబ్ సౌకర్యం, కుర్చీలు, మరుగుదొడ్లుగానీ ఏఒక్కటీ సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం డిగ్రీ కాలేజీకి తాత్కాలిక వసతులు ఏర్పాటు చేసి, శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలి. లేకపోతే విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

తరగతి గదుల్లో స్పాట్ వాల్యూయేషన్.. ఆరుబయట చదువులు

సిహెచ్.రాజేశ్వరి, డిగ్రీ, ద్వితీయ సంవత్సరం

ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్ కారణంగా చెట్ల కింద ఆరుబయటే చదువుసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సొంత భవనాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కనీసం బ్లాక్బోర్డులు కూడా లేవు. డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు ఏర్పాటు చేస్తే ఎంతోమంది విద్యార్థులు చదువుకునేందుకు ముందుకు వస్తారు. తక్షణం భవనాలు ఏర్పాటు చేయాలి.

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ..

సబ్స్టేషన్ల వద్ద టిడిపి ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచుతూ ప్రజలపై భారాలు వేస్తోందని టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్లోని సబ్స్టేషన్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో తాను అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోనని అధికారంలోకి వచ్చాక ఏడుసార్లు ఛార్జీలు పెంచి రూ.57,188 కోట్లు లూటీ చేసి రాష్ట్ర ప్రజలను మోసగించారని విమర్శించారు. డ్వాక్రా, అంగన్వాడీ సంఘాల రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేరగాని నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో వీరవాసరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, భీమవరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రేపు వెంకన్న, కౌరు పృధ్వీశంకర్, భీమవరం పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం: రాష్ట్రంలో ఏడు సార్లు విద్యుత్ ఛార్జీల పెంపుతో వినియోగదారులపై రూ.17,093 కోట్ల భారం పడిందని టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు విమర్శించారు. రాయపేటలోని విద్యుత్ సబ్స్టేషన్ వద్ద రామరాజు ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో 9,529 మెగావాట్ల సామర్థ్యాన్ని చంద్రబాబు నాయుడు 2018 నాటికి 19080 మెగావాట్లకు పెంచి జగన్ రెడ్డికి మిగులు విద్యుత్ ఇచ్చినట్లు తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం పదివేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం పెంచారని తెలిపారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వమన్నారు.

భీమవరం రూరల్ : విద్యుత్ సబ్స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో స్థానిక జయలక్ష్మి థియేటర్ వద్ద ఉన్న సబ్స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోతుల అన్నవరం, పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, కిలపర్తి వెంకట్రావు, దాసరి కృష్ణవేణి, సుందర రమాదేవి పాల్గొన్నారు.

గణపవరం : విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ టిడిపి మండల కమిటీ ఆధ్వర్యాన వరధరాజపురం సబ్స్టేషన్ వద్ద నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల భారంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. గ్రామ అధ్యక్షులు కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, నాయకులు పల్లి వెంకటేశ్వరరావు, షేక్ బషీరుద్దీన్ కడగళ్ల చిన్న పాల్గొన్నారు.

ఆకివీడు : ధర్నాలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామరాజు

తణుకు : మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో తణుకు సబ్స్టేషన్ వద్ద టిడిపి శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బినామీలకు అప్పజెప్పడానికి విద్యుత్ ఛార్జీలు పెంచారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు వెంకటకృష్ణ మాజీ ఎఎంసి ఛైర్మన్ బసవ రామకృష్ణ, చుక్కా సాయి బాబా, గుబ్బల శ్రీనివాస్, పితాని మోహన్రావు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ మండలంలోని యాళ్లవానిగర్వు విద్యుత్ సబ్స్టేషన్ టిడిపి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నిరసనలో పాల్గొన్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్సి అంగర రామ్మోహన్ మాట్లాడారు. చంద్రబాబు నాయుడు హయాంలో కరెంటు వెలుగులు ఉంటే జగన్మోహన్ రెడ్డి హయాంలో ప్రతి ఇంట్లో చీకట్లు ఆలముకుంటున్న పరిస్థితి ఉందన్నారు. టివి, ఫ్రిజ్, తదితర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించుకోవాలంటే మహిళలు భయపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్సి రామ్మోహన్, కోడి విజయభాస్కర్, జిఎస్ఎన్ రాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, గండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకివీడు : పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు డిమాండ్ చేశారు. ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో ఐ.భీమవరం రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఎఇ ప్రసాదరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, మాజీ డిసిసిబి ఛైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం) పాల్గొన్నారు.

ఉండి : ఆక్వా జోన్ నాన్ ఆక్వా జోన్ అనే బేధాలు లేకుండా ప్రతి ఒక్క ఆక్వా రైతుకూ విద్యుత్ సబ్సిడీని ఇవ్వాలని టిడిపి శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి విద్యుత్ ఎఇ ముదునూరి మాధవరాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కరిమెరక నాగరాజు మాట్లాడారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, జోన్లతో సంబంధం లేకుండా ఆక్వా రైతులకు సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పేరిచర్ల కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

కాళ్ల : పెరిగిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా టిడిపి మండల అధ్యక్షులు గుండా బత్తుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాళ్ల విద్యుత్ సబ్స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ ఎఇ పి.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాళ్ల ఉప సర్పంచి పన్నాసి అబ్బులు, మాజీ సర్పంచి వీరవల్లి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి నడింపల్లి విశ్వనాథరాజు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ అధ్యక్షతన వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన వక్ఫ్ ఆస్తులను కేటగిరి వారీగా విభజించి సమాచారాన్ని అందజేయాలన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభజన అనంతరం జిల్లాకు 273.14 ఎకరాల వక్ఫ్ ఆస్తులను లెక్కించడం జరిగిందన్నారు. దీనిలో ఎక్కువ మొత్తం ఆక్రమణలకు గురైనట్టు గుర్తించామన్నారు. తహశీల్దార్ల ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో 26 మసీదులు, 19 పీర్ల పంజాలు, 5 దర్గాలు, 4 ఈద్గాలు, ఒక సత్రం, ఒక ఆస్థాన మొత్తం 56 సంస్థలు ఉన్నాయన్నారు. వక్ఫ్ ఆస్తులను అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయం తక్కువగా ఉందని, అద్దెల ధరను పున్ణ సమీక్షించి ఆదాయం పెంపునకు ఆలోచన చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, అడిషనల్ ఎస్పి ఎవి.సుబ్బరాజు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృపావరం, జిల్లా సర్వే అధికారి జాషువా, ఆర్అండ్బి, అటవీ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు

గ్రామాల అభివృద్ధి బాధ్యత ప్రభుత్వానిదే

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఏ గ్రామం వెళ్లినా తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ వంటి ప్రధాన సమస్యలపై ప్రజలు నిలదీసే పరిస్థితి నెలకొందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. కలవపూడి గ్రామ పంచాయతీ మోడీ ప్రాంతంలో జల జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పైపులైను విస్తరణ పనులను ఎంఎల్ఎ రామరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా గ్రామాలను అభివృద్ధి చేయాల్సి బాధ్యత ఉందన్నారు. వైసిపి పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. వారంలోపు పైపులైన్ విస్తరణ పనులు పూర్తిచేసి ప్రజలందరికీ పూర్తిస్థాయిలో తాగునీరందించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. మోడీలో సుమారు రూ.17 లక్షలు, కలవపూడి గ్రామంలో రూ.47.50 లక్షల నిధులతో సుమారు 700 మీటర్ల మేర చేపట్టిన పైప్లైన్ విస్తరణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఎంఎల్ఎ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గేదల జాన్, టిడిపి గ్రామ అధ్యక్షుడు నంబూరి త్రినాథ మూర్తిరాజు, బి.దుర్గారావు, మాజీ ఉప సర్పంచి మంతెన వేణు పాల్గొన్నారు.

ప్రతి వినతినీ పరిష్కరించాలి

అడిషినల్ ఎస్పి సుబ్బరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా స్పందనలో వచ్చిన ప్రతి వినతినీ పరిష్కరించాలని జిల్లా అడిషనల్ ఎస్పి ఎవి సుబ్బరాజు ఆదేశించారు. సోమవారం స్థానిక డిఎస్పి కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ స్పందన కార్యక్రమం జిల్లా నలుమూలల నుంచి 16 మంది వివిధ సమస్యలపై వచ్చి అడిషనల్ ఎస్పి తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఆయన ఫిర్యాదులను ఆయా పరిధిలోని స్టేషన్లకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు.

వినతులు స్వీకరిస్తున్న ఎఎస్పి సుబ్బరాజు

నియామకపత్రాలు అందజేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాస్

వాలంటీర్లకు నియామకపత్రాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

మండల పరిధిలో నూతనంగా నియామకమైన 9 మంది వాలంటీర్లకు సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ నియామకపత్రాలను అందజేశారు. ఎంపికైన వాలంటీర్లు కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సంగాని వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణిత పరీక్ష

ప్రజాశక్తి - పెనుమంట్ర

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం లెక్కలు పరీక్ష నిర్వహించినట్లు ఎంఇఒ డి.శారదాజ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా పెనుమంట్రలో 217 మందికి గాను ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. పొలమూరులో 97 మంది విద్యార్థులకు గాను ఐదుగురు, మార్టేరు ఎస్‌విజిహెచ్‌లో 150 విద్యార్థులకు ఆరుగురు, మార్టేరు ఐసిబిదేవి బాలికల హైస్కూల్లో 141 మంది విద్యార్థులకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎంపిడిఒ వి.పూర్ణచల్లి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అత్తిలి : పది పబ్లిక్ పరీక్షల్లో సోమవారం లెక్కల పరీక్ష జరిగినట్లు ఇన్‌ఛార్జి ఎంఇఒ డి.శారదాజ్యోతి అన్నారు. అత్తిలి గౌతమిలో 241 మంది విద్యార్థులకు గాను 3 గైర్హాజరయ్యారని, ఆరవల్లిలో 132 విద్యార్థులకు గాను ఐదుగురు, కొమ్మర హైస్కూల్లో 82 మంది విద్యార్థులకు ముగ్గురు, బల్లిపాడు హైస్కూల్లో 81 మంది విద్యార్థులకు 1 గైర్హాజరయ్యారని తెలిపారు.

పోడూరు : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన గణితం పరీక్షకు 566 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల వ్యాప్తంగా మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - గణపవరం

పిప్పర బస్టాండ్ వద్ద ఆక్రమణలు తొలగించాలని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నంద్యాల రామలింగరాజు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో రెండో ప్రధాన ఊరైన పిప్పర బస్టాండు నుంచి ప్రయాణికులు అత్తిలి, తాడేపల్లిగూడెం, భీమవరం వెళ్లే వారికి ఉపయోగపడే బస్టాండ్‌ను స్థానికులు ఆక్రమించినా అధికారులు పట్టించుకోకపోవడం వల్ల మహిళలు, విద్యార్థులు ఎండలో నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా బస్టాండ్‌లో మద్యం తాగడం వల్ల మహిళలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలన్నారు.

16న ఉద్యోగుల సంఘం సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 16వ తేదీన భీమవరంలోని త్యాగరాజు భవనంలో ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ద్వితీయ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏపి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కెఆర్.సూర్యనారాయణ, జి.అస్కార్‌రావు హాజరవుతున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగుల హక్కులపై రాష్ట్రవ్యాప్తంగా కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగులను చైతన్య పరుస్తూ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతున్న ఉద్యోగుల సంఘానికి అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి అన్ని శాఖలకు సంబంధించిన ఉద్యోగులు పాల్గొని సమావేశం విజయవంతం చేయాలని కోరారు.


పాలకొల్లు తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పెద్దిరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

పాలకొల్లు తహశీల్దార్‌గా పెద్దిరాజు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు తహశీల్దార్‌గా సిహెచ్ పెద్దిరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పెద్దిరాజు నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించి ఉద్యోగోన్నతిపై పాలకొల్లు తహశీల్దార్‌గా వచ్చారు. ఆయనను ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగదేవి, ఆర్ఐ పంపన త్రిమూర్తులు, సర్వేయర్ భద్రరాజు, సిబ్బంది అభినందించారు.

పాఠశాలకు గ్లాసులు, స్పూన్లు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలకు జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేసేందుకు గాను రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు నిట్టల శైలజ సోమవారం వంద గ్లాసులు, స్పూన్లు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ప్రభుత్వం మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ ఇవ్వడం అభినందనీయమన్నారు. హెమోగ్లోబిన్, ఐరన్ శాతం పెరగడం కోసం ప్రతి విద్యార్థి రాగిజావ తాగి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. పాఠశాలకు ఏ అవసరం వచ్చిన తన వంతు సహాయం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయిని శశికళ పాల్గొన్నారు.

అందేవారిమెరకలో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపిపాలెం అందేవారిమెరకలో ఉన్న జలదుర్గాంబ సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం భారీ అన్న సమారాధన చేశారు. ఇటీవల స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవం ముగింపు సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

చేపల చెరువులో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గణపవరం

చేపల చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి పిప్పరలో జరిగింది. ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలకంపాడు గ్రామానికి చెందిన పాండ్రంగి వెంకన్నకు చెందిన చేపల చెవువు వద్ద అస్సాం రాష్ట్రానికి చెందిన బస్సాన్ దాసు (45) 4 నెలలుగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఏడుగంటల సమయంలో దాసు మద్యం తాగి చేపలకు మేత వేయడానికి పడవలోకి వెళ్లడానికి వీలుగా టైరుపై కాలువేశాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులోపడి చనిపోయినట్లు ఎస్ఐ చెప్పారు. దాసు చనిపోయిన విషయం అస్సాంలో ఉన్న అతని భార్యకు తెలియజేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

యాంత్రీకరణతో తగ్గిన ఉపాధి : వ్యకాస

ప్రజాశక్తి - ఇరగవరం

సాంప్రదాయ వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీ తీసుకురావడం వల్ల కూలీలకు ఉపాధి కోల్పోతారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బల్ల చిన వీరభద్రరావు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని గోటేరు గ్రామంలో పంట కాలువలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ ఏడాది పొడవునా కూలీలకు పని కల్పించేందుకు ప్రభుత్వం అంచనా కట్టిన విలువ రూ.89 వేల కోట్లు అయితే ఇటీవల ప్రకటించిన బడ్జెట్లో కేటాయించింది రూ.60 వేల కోట్లు మాత్రమేనని తెలిపారు. దీంతో కూలీలకు చేతినిండా పని దొరికే పరిస్థితి లేదన్నారు. వ్యవసాయ రంగంలో ఇప్పటి వరకూ పురుగు మందులు జల్లుతున్న డ్రోన్లు ఇక నుంచి తక్కువ సమయంలో వరి నాట్లు వేసేందుకు ఆధునిక సాంకేతిక హంగులతో డ్రోన్ అనే యంత్రాన్ని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రి యూనివర్సిటీలో పరిశోధన చేస్తున్నారని వీరభద్రరావు తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో వినియోగిస్తున్న యాంత్రీకరణ, బెంగాల్ కూలీలు మన ప్రాంతానికి రావడం వల్ల కూలీలకు పని దినాలు తగ్గిపోయాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీని ప్రతిష్టాత్మకంగా అమలు చేసి అడిగిన ప్రతి కుటుంబానికీ 200 రోజులు పని కల్పించాలని లేకుంటే చట్టప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడలి దుర్గ, జుత్తిగ లక్ష్మి, దొంగ రాజేశ్వరి, అంబటి నరేంద్ర, మురళీకృష్ణ, కాటి శాంతకుమారి, జుత్తిగ సత్యనారాయణ, గుబ్బల ప్రసాద్, జుత్తిగ వరలక్ష్మి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సోమరాజు

తాడేపల్లిగూడెం : అడిగిన ప్రతి కుటుంబానికీ పని కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. సోమవారం జగనాథపురంలోని ఉపాధి పని ప్రదేశంలో కూలీలతో ఆయన మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం పనులు ఇప్పుడిప్పుడే కల్పిస్తున్నారని, అది కూడా పూర్తిస్థాయిలో కల్పించడం లేదని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కూలీ 600 రూపాయలు ఇవ్వాలని, కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నాయుడు పిన్నమనేని సుబ్బారావు, పి.కోటేశ్వరరావు, తోట సత్యనారాయణ, మేకా ప్రసాద్, పెంటపాడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామ్‌కుమార్

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - పోడూరు

ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని ఎస్ఐ డి.రామ్‌కుమార్ అన్నారు. హెల్మెట్ డ్రైవ్ కార్యక్రమాన్ని సోమవారం పెనుమదంలో నిర్వహించారు. అనంతరం హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వాహనదారులను ఆపి వారికి హెల్మెట్ వల్ల కలిగే ప్రయోజనం వివరించి జరిమానా విధించారు. అలాగే హెల్మెట్ పెట్టుకుని ప్రయాణిస్తున్న వాహన దారులను అభినందించారు. ఆయనతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - ఆకివీడు

తమ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ప్రిన్సిపల్ కె.సుజాత, కార్యదర్శి డాక్టర్ పిబి.ప్రతాప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ పథకం అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకంలో శిక్షణ పొందడానికి 15 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్యలో ఉన్నవారు అర్హులని తెలిపారు. శిక్షణ మూడు నెలలు ఉంటుందన్నారు. డేటా ఎంట్రీ కోర్స్‌కు పదో తరగతి, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం (పైథాన్)కు డిగ్రీ అర్హత అని తెలిపారు. కోర్సుల్లో చేరేవారు ముందుగా 8688594244, 942885556 నంబర్లను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

హరికథకు తగ్గుతోన్న ఆదరణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రాచీన కళ హరికథ అని, ప్రస్తుతం హరికథకు ఆదరణ తగ్గిందని ప్రముఖ వయోలిన్ విద్వాంసులు విజయవాడ ఎఐఆర్ పాలపర్తి ఆంజనేయులు తెలిపారు. స్థానిక త్యాగరాజ భవనంలో ప్రస్తుత కళలు, ఆదరణ, హరికథ ప్రాధాన్యత అంశంపై చర్చ గోష్టి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంపూర్ణ ధ్యాన సంపద సంగీతంలోనే ఉందన్నారు. ఆదిభట్ల నారాయణ దాసు హరికథ పితామహుడు అని తెలిపారు. రామాయణ, భాగవత గాధలను పండిత పామరులకు అర్థమయ్యేలా హరికథ రూపంలోని మలిచారని తెలిపారు. చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి మాట్లాడారు.

నరసాపురంలో శామ్యూల్ హానిమన్ జయంతి

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద హోమియో వైద్య పితామహుడు శామ్యూల్ హానిమన్ జయంతి సోమవారం జరిగింది. ఈ సందర్భంగా హానిమన్ విగ్రహానికి వైద్యులు నివాళులర్పించారు. గోదావరి జిల్లా రిజిస్టర్డ్ హోమియో డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శిరిగినీడి రమేష్, డాక్టర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ తహశీల్దార్ బెజవాడ సీతారత్నం ముఖ్య అతిదిథిగా విచ్చేసి మాట్లాడారు. హోమియో వైద్యం మానసిక శారీరక లక్షణాలను బట్టి మందులిచ్చే గొప్ప వైద్యమని, ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ డాక్టర్ పల్లా వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాన్ హెన్రీ, ఎంఎన్.స్వామి, డాక్టర్ జనార్ధన్ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో ప్రధాని మాతృత్వ యోజన ఆవాజ్ కార్యక్రమంలో భాగంగా 40 మంది గర్భిణులకు సోమవారం పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రభాకర్, మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర, పట్టణ అధ్యక్షులు తటవర్తి కృష్ణమూర్తి, కె.సూర్యనారాయణ రాజు, గోపాలరాజు, సిహెచ్ విజయ్‌కుమారి, నర్సింగ్ సూపరింటెండెంట్ కుమారి, నాయుడు ,వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి బుద్ధరాజుల చేతుల మీదుగా వాటిని అందజేశారు. గర్భిణులకు ప్రతినెలా 9న పౌష్టికాహారాన్ని వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు అందిస్తున్నారు. మందులు తణుకు ఏరియా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆలీ సౌజన్యంతో అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి డివిజన్, మండలస్థాయి అధికారులతో ధాన్యం కొనుగోలు, గ్రామ, వార్డు వాలంటీర్లకు సన్మానం, రీసర్వే, జగనన్న గృహ నిర్మాణాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. లేఅవుట్లలో మౌలిక వసతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు తేవాలన్నారు. తహశీల్దారు, ఎండిఒ గృహ నిర్మాణ శాఖ ఎఇ వారీగా ప్రత్యేక అధికారులు సమీక్షించి పనులు ఎక్కడ మందకొడిగా సాగుతున్నాయో వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టరు ఆదేశించారు. వచ్చేవారం జిల్లాలో జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయిలో హౌసింగ్ లేఔట్‌లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన లేఅవుట్లలో ఆర్చీల నిర్మాణం మ్యాజిక్ సోపిట్లు గృహాలకు వీధిలైట్లకు విద్యుత్ సరఫరా చేయాలన్నారు.

రబీ ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

జిల్లాలో రబీ 2022- 23 కాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రైతుల వద్ద నుండి ధాన్యాన్ని మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా శుభ్రంగా ఉన్న ధాన్యం ఆరబెట్టుకొని నాణ్యతా ప్రమాణాలకు లోబడి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు రబీ 2022-23గాను ధాన్యం 100 కిలోల కామన్ రకం రూ.2,040, ఎ గ్రేడ్ రకం రూ.2,060, 75 కిలోల కామన్ రకం రూ.1530, ఎ గ్రేడ్ రకం రూ.1545 చొప్పున రైతుల నుండి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సంచులు, హమాలీలను, రవాణాకు కావాల్సిన వాహనాలను ఎవరు సమకూరిస్తే వారికి ప్రభుత్వం వారు నిర్దేశించిన ధర సొమ్మును చెల్లించడం జరుగుతుందన్నారు. రైతు తన సొంతంగా అవి ఏర్పాటు చేసుకుంటే వాని ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. గోనె సంచుల వినియోగానికి ప్రతి సంచికీ రూ.3.39 పైసలు, హమాలీ ఛార్జీ ప్రతి టన్నురూ రూ.220, ధాన్యం రవాణా ఛార్జీలు 8 కిలోమీటర్ల వరకూ ప్రతి టన్నుకూ రూ.324 చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ నెల 14న ప్రతిభ కనబర్చిన గ్రామ, వార్డు వాలంటీర్లకు ప్రశంసా పత్రాలిచ్చి సన్మానించనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డిఒ దాసి రాజు, మండల ప్రత్యేక అధికారులు, ఇన్‌ఛార్జి గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టరు, డిఇ జి.పిచ్చయ్య, తహశీల్దార్లు పాల్గొన్నారు.

మోషేన్‌రాజును కలిసిన ఎంఎల్‌సి జయమంగళ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎంఎల్‌సిగా ఎన్నికైన జయమంగళం వెంకటరమణ సోమవారం శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజును భీమవరం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మోషేనురాజు ఎంఎల్‌సిగా ఎన్నికైన జయమంగళం వెంకటరమణకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైసిపి అభివృద్ధిపై చర్చించారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెనుగొండ

కోడిపందేలుదిబ్బ వాసుల తాగునీటి సమస్యను గుర్తించిన ఎంఎల్ఎ చెరుకువాడ రంగనాథరాజు సోమవారం వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ కాలనీకి రోడ్లు, కరెంటు తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. రూ.27 లక్షలతో 60 వేల లీటర్లు సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఎం.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పెనుగొండలో మారమ్మ గుడికి వెళ్లే కాలినడక మెట్ల నిర్మాణ పనులకు ప్రారంభించారు. అలాగే సిద్ధాంతం గ్రామంలో డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, ఎంపిటిసి చిన్న ఏడుకొండల ఈశ్వర్ పాల్గొన్నారు.

జెవికె స్టాక్ పాయింట్ల పరిశీలన

ప్రజాశక్తి - పాలకోడేరు

2023-24 విద్యా సంవత్సరానికిగాను జగనన్న విద్యా కానుక కిట్లను వీరవాసరం, శృంగవృక్షం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో భద్రపర్చనున్నట్లు జెవికె (జగనన్న విద్యా కానుక) ఎపిసి శ్యాంసుందర్ తెలిపారు. జెవికె బృందం శృంగవృక్షం జెడ్‌పి ఉన్నత పాఠశాలలను సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే టెక్స్, రాత పుస్తకాలు, షూలు, బ్యాగ్‌లు, బెల్టు, ఏకరూప దుస్తులను నిల్వ కేంద్రాల్లో భద్రపర్చి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వాటిని విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. వారి వెంట జెవికె ప్రత్యేకాధికారి డి.మాధవిలత, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

వీరవాసరం ఎంఆర్‌కె హైస్కూల్లో స్టాక్ పాయింట్ పరిశీలించిన ప్రత్యేకాధికారి

వీరవాసరం :2023-24 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు అందించే జగనన్న విద్యాకానుక(జెవికె) కిట్లు పాఠశాల ప్రారంభం రోజునే అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిసి శ్యాంసుందర్ తెలిపారు. వీరవాసరం ఎంఆర్‌కె హైస్కూల్లో ఏర్పాటు చేసిన జెవికె స్టాక్ పాయింట్‌ను సోమవారం జిల్లా బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా శ్యాంసుందర్, జెవికె స్టాక్ పాయింట్ పరిశీలన ప్రత్యేకాధికారి డి.మాధవీలత మాట్లాడారు. స్టాక్ పాయింట్లను పరిశీలించి వాటికి తగిన భద్రత ఉందీ లేనిది పరిశీలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.వినాయకుడు, ప్రధానోపాధ్యాయిని బి.ప్రభామంజిరి, సిఆర్‌పిలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పోడూరు మండలం, పోడూరు పెద్దపేటకు చెందిన బద్దా విజయ్‌కుమారి, భర్త: చిరంజీవి కు చెందిన **M8392087** నెంబర్ గల పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం పోడూరు నుండి పాలకొల్లు మోటార్ సైకిల్‌పై తీసుకు వెళు తుండగా మార్చి 25వ తేదీన పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు మార్గ మధ్యలో పడిపోయినది. కావున నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈక్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

అడ్రస్: బద్దా విజయ్‌కుమారి
భర్త: చిరంజీవి, ఇంటి నెంబర్: 8-48
పెద్దపేట, పోడూరు మండలం
పశ్చిమగోదావరి జిల్లా,
పిన్‌కోడ్ నెంబర్:534327
సెల్: 9989783571

In the Court of the Principal Junior Civil Judge, Tanuku
O.S. 657/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Alamuru ...*Plaintiff*
Vs
Vemula Kedareswari, another ...*Defendants*
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. వేముల కేదారేశ్వరి, W/o. యర్రియ్య, హిందువు, స్త్రీ, 57 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2. వేముల సూర్య వంశీధర్, S/o. చంద్రశేఖర్, హిందువు, పురుషుడు, 41 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 12-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.
D.S.V.KRISHNAJI
Advocate, Tanuku

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
O.S. 200/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Alamuru ...*Plaintiff*
Vs
Kondeti Sriramachandra Murthy, another ...*Defendants*
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. కొండేటి శ్రీరామచంద్రమూర్తి, S/o. వెంకట రమణారావు, హిందువు, పురుషుడు, 59 సం॥లు, అడవిపాలెం, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2. పజ్జూరి రమేష్, S/o. మల్లేశ్వరరావు, హిందువు, పురుషుడు, 39 సం॥లు, బిసి ట్యాంక్ వీధి, పాలకొల్లు, పాలకొల్లు JCJC.
పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 12-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.
T.RAMADEVI
Advocate, Tanuku

పాస్‌పోర్టు పోయినది

తోట శ్రీను, తండ్రి: నారాయుడు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. ఇంటి నుండి వదలి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా మార్గ మధ్యంలో నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబరు **B2027792** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: తోట శ్రీను
తండ్రి: నారాయుడు
H.No. 8-136/1, పల్లవారితోట
పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా
పిన్: 534324
సెల్: 9000149917

In the Court of the Principal Junior Civil Judge, Tanuku
O.S. 570/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Tanuku ...*Plaintiff*
Vs
Tholeti Dhamayanthi, another ...*Defendants*
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. తోలేటి దమయంతి, W/o. నాగేశ్వరరావు, హిందువు, స్త్రీ, 51 సం॥లు, డో.నెం. 3-75, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2. వేముల కేదారేశ్వరి, W/o. యర్రియ్య, హిందువు, స్త్రీ, 46 సం॥లు, డో.నెం. 4-125, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 12-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.
N.RAVI SHANKAR
Advocate, Tanuku

In the Court of the Principal Junior Civil Judge, Tanuku
O.S. 276/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Alamuru ...*Plaintiff*
Vs
Thonta Hemalatha, another ...*Defendants*
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. తొంట హేమలత, W/o. శేకర్, హిందువు, స్త్రీ, 51 సం॥లు, డో.నెం. 8-48/1ఎ, అడవిపాలెం, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2. కట్టా పద్మావతి, W/o. వెంకటేశ్వరరావు, హిందువు, స్త్రీ, 50 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 12-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.
N.RAVI SHANKAR
Advocate, Tanuku

In the Court of the Principal Junior Civil Judge, Tanuku
O.S. 366/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Alamuru ...*Plaintiff*
Vs
Tholeti Kanaka Durga, another ...*Defendants*
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. తోలేటి కనకదుర్గ, W/o. సత్యమూర్తి, హిందువు, స్త్రీ, 44 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2. వేముల సూర్య వంశీధర్, S/o. చంద్రశేఖర్, హిందువు, పురుషుడు, 42 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 12-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.
D.S.V.KRISHNAJI
Advocate, Tanuku

In the Court of the Principal Junior Civil Judge, Tanuku
O.S. 552/2020
Between:
Bank of Baroda (Erstwhile Vijaya bank), Tanuku ...*Plaintiff*
Vs
Midde lalitha Kumari, another ...*Defendants*
వాది తరుపున చేసిన ప్రకటన
ప్రతివాదులు:
1. మిద్దె లలితకుమారి, W/o. రామారావు, హిందువు, స్త్రీ, 48 సం॥లు, డో.నెం. 4-95, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2. వేముల సూర్య వంశీధర్, S/o. చంద్రశేఖర్, హిందువు, పురుషుడు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినను మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది. 13-04-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది గాను, అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.
N.RAVI SHANKAR
Advocate, Tanuku